క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం

ఎదులాపురం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా అదనపు మొదటి న్యాయమూర్తి శివరాం ప్రసాద్‌రావ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి ఆట పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించగా న్యాయమూర్తి దుర్గారాణితో కలిసి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేశ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్సింగ్‌రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చోడ డిగ్రీ కళాశాల్లో బీఏ, బీకాం కంప్యూటర్, బీఎస్సీ, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ కోర్సులో సీట్లు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రిని కలిసిన లెక్చరర్ల సంఘం నాయకులు

కైలాస్‌నగర్: ఇటీవల నూతనంగా ఎన్నికైన తెలంగాణ గజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియన్ (475) సభ్యులు శనివారం రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో ఆయనను కలిసి పూలమొక్క అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, ప్రతినిధులు అశోక్‌రెడ్డి, రవికాంత్, రవి, ప్రవీణ్ కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

హరినార్కే ఆశయ సాధనకు కృషి చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రొఫెసర్ హరినార్కే ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పూలే విశ్రాంతి భవనంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాంసెఫ్ జిల్లా అధ్యక్షుడు గణేష్ మెకానే, రవి జాబడే, సాంబన్న శేండే, సురేశ్ గురునులే, సతీష్ గురునులే, విజయ్ వాడగూరే, ధనంజయ్ ప్రధాన్, భాస్కర్ ప్రధాన్, పెంటపర్తి ప్రహ్లాద్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని మహంకాళి ఆలయ ప్రహరీ నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ. 2.50 లక్షలు మంజూరయ్యాయి. దీంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మానంద్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ సునీత, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, ఆడే శీలా, మెస్రం జలంధర్, మాధవ్ కేంద్రే, జాదవ్ రమేష్, వామన్ గిత్తే పాల్గొన్నారు.

అమ్మ చేతి ముద్ద కమ్మన



కూతురుకు తినిపిస్తున్న తల్లి

బోథ్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులను చూడటానికి తల్లిదండ్రులు వచ్చారు. తల్లిదండ్రులు చూసిన విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. పాఠశాల ఆవరణలో పిల్లలతో తల్లిదండ్రులు సరదాగా గడిపారు. ఇంటి నుంచి తీసుకువచ్చిన వంటకాలను తినిపించారు. సాయంత్రం వరకు పిల్లలతో గడిపారు.

నిరుపేద కుటుంబానికి అండగా ఉంటాం

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన జాదవ్ గణేశ్ డ్రైవర్‌గా పని చేస్తూ గుండెపోటుతో వారం రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఖంపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ శ్రీనివాస్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట విద్యారాణి ఉన్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

నార్నూర్: ఆదివాసీ చట్టాలు, హక్కుల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని రుప్పాపూర్ గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. పాలకులు కొత్త చట్టాలతో గిరిజనుల హక్కులను హరించాలని చుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడ్మేత సోంబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చాయ్ తాగాల్సిందే..



టీస్టాల్ వద్ద టీ ప్రియులు



చాయ్ తయారు చేస్తున్న నిర్వాహకులు

- ఆదిలాబాద్‌లో వెలిసిన వివిధ రకాల టీషాప్‌లు
- తాగేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు



తేనీటిని ఆస్వాదిస్తున్న ప్రజలు

ఆదిలాబాద్: నలుగురు కూర్చుని మాట్లాడుకోవాలన్నా టీ కొట్టు దగ్గరికి వెళ్తారు. ఏ సమావేశమైనా టీ తప్పనిసరి. సాక్షాత్తు ప్రధానమంత్రి చాయ్ పే చర్చా కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం దేశంలో ఛాయ్‌కి ఉన్న ఆదరణను స్పష్టం చేస్తుంది. టీ తాగనిదే చాలామందికి పొద్దు గడవదు. ఉదయం లేవగానే టీ తాగాల్సిందే. అందుకోసం ఎంత దూరమైన వెళ్లేవారు ఉన్నారు. టీ ప్రియుల అభిరుచులను దృష్టిలో పెట్టుకొని నేడు పెద్ద సంఖ్యలో టీ ఔట్ లెట్లు వెలుస్తున్నాయి. వర్షాకాలం కూడా కావడంతో చల్లటి వాతావరణంలో వేడి వేడి చాయ్ తాగడానికి జనాలు ఆసక్తికి చూపుతున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు..

టీ తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను గ్రీన్, బ్లాక్ టీలు దూరం చేస్తుందని వెల్లడిస్తున్నారు. అదేవిధంగా శరీరంలోని కొవ్వును కరిగించడమే కాకుండా, మానసిక ఉత్తేజానికి దోహదం చేస్తుందని పరిశోధనలు తెలుపుతున్నాయి. టీ ఆరోగ్యమే కాకుండా.. అందాన్ని కూడా పెంచుతుందని, వయస్సు తగ్గి, చర్మం ముడతలు పడకుండా ఉండేలా చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

యువతకు ఉపాధి..

టీస్టాల్ ఏర్పాటు చేసుకోవడం నేడు మంచి వ్యాపార సాధనంగా మారింది. పలు సంస్థలు తమ బ్రాండ్ పేరుతో పట్టణాలు, నగరాలలో బ్రాంచీలను ప్రారంభిస్తున్నాయి. యువత నగదును చెల్లించి ఫ్రాంచైజీ తీసుకుంటున్నారు. ఫ్రాంచైజీలలో వివిధ వెరైటీల టీలు లభ్యమవుతుండడంతో జనాలు వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లా కేంద్రంలో మహారాష్ట్రకు సంబంధించిన పలు టీ ఫ్రాంచైజీలు పెద్ద మొత్తంలో వెలుస్తున్నాయి. వీటిలో లభించే టీ ఫ్లేవర్లను టేస్ట్ చేసేందుకు టీ ప్రియులు బారులు తీరుతున్నారు.

టీలో వెరైటీలు..

టీలలో ఎన్నో వెరైటీలు ఉన్నాయి. గూడ్ ఛాయ్, ఇ రానీ చాయ్, సొంటి కాఫీ, సొంటి టీ, గ్రీన్ టీ, లె మన్ టీ, బ్లాక్ కాఫీ, మిరియాలు టీ, ఇలచీ టీ, దమ్ టీ, మసాలా టీ, జింజర్ టీ, కశ్మీరీ చాయ్, బ్లాక్ టీ లభ్యమవుతున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలో తందూరి చాయ్‌కి భలే గిరాకీ ఉంటోంది. అలాగే బాదం ఛాయ్ తాగేందుకు మక్కువ చూపుతున్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

బోథ్: మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా జెండా ఆవిష్కరించారు. సామ్యవాద సమాజ స్థాపన కోసం ఉద్యమాన్ని నిర్మిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని గుర్తుచేశారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్, సిరిపురం దాసు, షేక్, నరేశ్, షాకీర్, మున్షిఫ్, సంతోష్, ఖాజీమొద్దీన్, వెంకట రమణ, ముఖ్రిమొద్దీన్, లక్ష్మణ్, ఆశీర్వాద్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య 88వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మడావి గణేశ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గిరిజన బాలుర కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దత్తు, బాలాజీ, దుందేరావు, యశ్వంత్, మనోజ్, జగన్మోహన్, శ్యాంరావ్ పాల్గొన్నారు.

బంగారుగూడలో కార్డన్ సెర్చ్

- 18 బైక్‌లు, 3 ఆటోలు స్వాధీనం



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంగారుగూడ కాలనీలో శనివారం రాత్రి ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావ్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైనా పత్రాలు లేని 18 బైక్‌లు, 3 ఆటోలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పరిచడం లేని వ్యక్తులకు ఇంటిని అద్దె ఇవ్వవద్దన్నారు. కాలనీలో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కాలనీలో, ప్రధాన రోడ్లకు, ఇంటి ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటికి తాళం ఊరు వెళితే పోలీసులకు, పక్కా ఇంటి వారికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ, ఎస్సైలు సయ్యద్ ముజాహిద్, విష్ణు వర్ధన్, ధనశ్రీ, శివారం, తదితరులు పాల్గొన్నారు.

'సత్యాగ్రహ దీక్ష భగ్నం చేసేందుకు కుట్ర'



దీక్ష చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఇంద్రవెల్లి: గ్రూప్2 పరీక్షలను వాయిదా వేయాలని హైదరాబాద్‌లో బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేస్తున్న సత్యాగ్రహ దీక్షను భగ్నం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ కార్యదర్శి సోయం రాందాస్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అర్ధరాత్రి హౌస్ అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెందోర్ అంకుష్, వావల్కర్ శివాజీ, సోన్‌కాంబ్లే సునీల్, కాంబ్లే దీపక్, మెస్రం మురారీ, రవి , తదితరులు పాల్గొన్నారు.

నంబరు లేని వాహనాలు నడిపితే చర్యలు



వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

గుడిహత్నూర్: వాహనదారులు నంబరు ప్లేట్లు లేని వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై ఇమ్రాన్ హెచ్చరించారు. మండల కేంద్రంలో పలుచోట్ల వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పత్రాలు, నంబర్ ప్లేట్లను విధిగా ప్రదర్శించాలన్నారు. చలాన్ల నుంచి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లను వంచడం, తీసివేయడం, ఒక నంబర్‌కు స్టిక్కర్లు పెట్టడం లాంటివి చేస్తే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. శనివారం పలు వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట సిబ్బంది భూమన్న, ఏఆర్ కానిస్టేబుల్స్ ఉన్నారు.

మండల కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: నాయీబ్రాహ్మణ సంఘం ఆదిలాబాద్ రూరల్ మండల కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగంపెల్లి రాములు, ప్రధాన కార్యదర్శిగా శేర్లవార్ నరేశ్, కోశాధికారిగా కురిమెల్ల స్వామిని ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను ఘనంగా సన్మానించారు.

ఆవుకు అంత్యక్రియలు

బోథ్: మండలంలోని మెందు నారాయణ చెందిన ఆవు మృతి చెందడంతో అంత్యక్రియలు నిర్వహించారు. గత 20 సంవత్సరాల నుంచి ఆవును ప్రేమగా చూసుకున్న రైతు నారాయణ ఆవు మృతి చెందడంతో కన్నీటి పర్యంతమయ్యాడు. శనివారం డప్పుచప్పుళ్ల మధ్య కుటుంబసభ్యులు అంత్యక్రియల నిర్వహించారు.

పోరాటానికి సిద్ధం కావాలి

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ పోరాటానికి మాదిగలు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేశ్ పిలుపునిచ్చారు. శనివారం మావల మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈనెల చివరి వారంలో హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రోడ్డ చిన్నయ్య, గైక్వాడ్ సూర్య కాంత్, రొడ్డ రాజశేఖర్, గంగన్న, శ్రీకాంత్, రొడ్డ ప్రదీప్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో శనివారం సర్పంచ్ అడవ్ మారుతి అంతర్గాత రోడ్లకు మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు గుంతలమయం కావడంతో మరమ్మతులు చేసినట్లు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఉట్నూర్‌రూరల్: కొలాం పీవీటీజీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కొలాం సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి టేకం వసంత్ రావు కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. ధర్మాజీపేట గ్రామానికి చెందిన గర్భిణి దాదాపు 7 కిలోమీటర్లు బీర్సాయిపేట వరకు కాలినడకన వచ్చి అక్కడి నుంచి ఆటోలో దంతన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుందన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఆత్రం భీంరావు, కుమ్ర లక్ష్మణ్, కొడప బాపురావు, టేకం రాజు, ఆత్రం మోతీరాం, ఆత్రం భీంరావు, కొడప జంగు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ధనోర ఉపకేంద్రానికి చెందిన 20 మంది గర్భిణీలకు వైద్యాధికారి నిఖిల్‌రాజ్ బీపీ, షుగర్, రక్తపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, హెల్త్ అసిస్టెంట్ విష్ణు, ఏఎన్ఎం లుచ్చుబాయి, స్వప్న, మీర పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

తలమడుగు: పశువులకు తప్పనిసరి గాలికుంటు టీకాలు వేయించాలని మాజీ డీసీసీబీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్ అన్నారు. శనివారం మండలంలోని భరంపూర్ గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. సర్పంచ్ భగీర్థబాయి, కేదారేశ్వర రెడ్డి, ప్రతాపరెడ్డి, సిబ్బంది సౌమ్య, స్వామి, విజయ్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ముఖరా(కె) అభివృద్ధి రాష్ట్రానికే ఆదర్శం



పరిశీలిస్తున్న సర్పంచ్, నాయకులు

ఇచ్చోడ: ముఖరా(కె) అభివృద్ధి రాష్ట్రానికే ఆదర్శమని సిరిసిల్ల జిల్లా మోయినకుంట సర్పంచ్ కల్వకుంట్ల వనజ గోపాల్‌రావు అన్నారు. శనివారం గ్రామాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, సాముహిక మరుగుదొడ్లు, పల్లెపార్క్, సేంద్రియ ఎరువుల తయారీ, సోలార్ విద్యుత్ దీపాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ముఖరా(కె) సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



పనులు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డుకాలనీలో నూతనంగా నిర్మిస్తున బస్తీ దవాఖానా పనులు తుదిదశకు చేరిన నేపథ్యంలో శనివారం ఆయన పరిశీలించారు. వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యరంగంలో ప్రభుత్వం నూతన సంస్కరణలను అమలు చూస్తూ.. పేదల ఇబ్బందులను దూరం చేస్తుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా బస్తీ దవాఖానాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ అరుణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీసీ ఐక్యవేదిక సదస్సు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గండ్రత్ సుజాత

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తరంగిణి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 14న నిర్వహించే బీసీ ఐక్యవేదికను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్ పిలుపునిచ్చారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని మాజీ మంత్రి, దివంగత నేత సీఆర్ఆర్ నివాసంలో మాట్లాడారు. బీసీలకు జనాభా ప్రతిపాదికన సీట్లను కేటాయించాలన్నారు. ఏడేళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రుణాలను మరిచిన సీఎం కేసీఆర్ ఎన్నికలు సమీపిస్తుండడంతో రూ. లక్ష సాయం అందజేస్తున్నారని విమర్శించారు. ఇందులో రూ. 20వేల బీఆర్ఎస్ నాయకులు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే జోగు రామన్ననే పేర్కొనడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, భూపెల్లి శ్రీధర్, చంద్రాల రాహుల్ పాల్గొన్నారు.

'బీసీల ఓట్ల కోసం కొత్త నాటకం'



జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్: బీసీల ఓట్ల కోసం సీఎం కేసీఆర్ రూ. లక్ష ఆర్థిక సాయం పేరిట కొత్త నాటకానికి తెరలేపారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గటిక క్రాంతి కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో లక్షా.. భిక్షా అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ. 7 వేల కోట్లు కేటాయించిందని, అయితే దాంట్లో కనీసం రూ. 200 కోట్లు కూడా ఖర్చు చేయకపోవడం సరికాదన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున బీసీ భవనం నిర్మిస్తామన్న హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు. దళితబంధు మాదిరిగా బీసీబంధులు అందజేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గండె విజయ్, శివయ్య, నరేశ్, సతీష్, మోహన్, విజయ్, అశ్విన్, అనూప్, పవన్, ముఖీమ్, కిరణ్, రాము, వెంకటేశ్, కాంతారావు, నవీన్ వర్మ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే రేఖానాయక్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ..

మండలంలోని యేంద గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. తరగతి గదులు, హాస్టల్ గదులలో తిరుగుతూ విద్యార్థుల వసతులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ. విద్యార్థులకు మంచి బోధన అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు పంచిపెట్టారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, మండల అధ్యక్షుడు రమేశ్, ఎస్పీరెడ్డి, దాసండ్ల ప్రభాకర్, తన్నీరు తనీశ్, వెంకటేశ్, రాజేశ్వర్, సుశీల్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు..

బోథ్: బోథ్ గ్రామానికి చెందిన షేక్ ఘఫూర్‌కు మంజూరైన రూ. 56 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎంపీపీ తుల శ్రీనివాస్ శనివారం ఎంపీపీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, జుగాది రావ్, మహిపాల్, సర్పంచ్ విజయ్, ఇఫ్తేకర్ అహ్మద్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలని ధర్నా



జెడ్పీచైర్మన్‌ను అడ్డుకున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి నుంచి బీర్సాయిపేట వరకు రోడ్డు అధ్వానంగా మారిందని వెంటనే మరమ్మతులు చేయాలని బీర్సాయిపేట గ్రామంలో ప్రధాన రహదారిపై స్థానికులు ధర్నా చేపట్టారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అదే మార్గం గుండా వస్తున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్ధన్‌ను అడ్డుకున్నారు. రోడ్డు మరమ్మత్తుతులు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఉట్నూర్ జడ్పీటీసీ చారులత రాథోడ్, పెందూర్ ప్రభాకర్, నాగాపూర్ సర్పంచ్ సునీల్ జాదవ్, లింగంపల్లి చంద్రయ్య, ఇక్బాల్, కలీం, అఖిల్, శ్రీకాంత్, కిషన్‌రావు, కృష్ణ పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు

- కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న కంది శ్రీనివాస్ రెడ్డి

కైలాస్‌నగర్: విద్యార్థులు పక్కా ప్రణాళితకతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో శనివారం నిర్వహించిన మాక్ పోలింగ్ కార్యక్రమానికి హాజరయ్యారు. పరీక్షల్లో రాణించిన విద్యార్థులకు గ్రేడ్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మాక్ పోలింగ్‌లో ఓటు వేసి విద్యార్థులను ప్రోత్సహించారు. ఆయన మట్లాడుతూ.. సమాజానికి తనవంతుగా సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చినట్లుగా పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.